# జపనీస్ బొమ్మ

సురేంద్ర ఎన్నో గిఫ్టులు తెచ్చాడు. అతను జపాను వెళ్లడం ఇదే ప్రథమం. చదువురీత్యా, ఉద్యోగరీత్యా అమెరికాకు, యూరప్‌కు ఎన్నోసార్లు వెళ్ళివచ్చాడు. కాని విచిత్రమైన వస్తువులకు జపాను పెట్టింది పేరు. అందుకే అరచేయంతటి టెలివిజను, గుప్పెడు సైజులో వున్న వీడియో కెమెరా, మరెన్నో విచిత్రమైన వస్తువులూ తెచ్చాడు.

పిల్లలు సూటుకేసు వద్ద కూర్చుని నాన్నగారు తెచ్చిన బొమ్మలు, ఆట వస్తువులు వింతగా చూస్తున్నారు. "ఇదెలా నడుస్తుంది? ఇదేం చేస్తుంది? నిజమైన హెలికాప్టరే. ఇది మరమనిషా? మరీ చిన్నది కదూ" అంటూ తండ్రిని ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. సురేంద్ర అన్నిటికీ నవ్వుతూ సమాధానం చెబుతూ ఒక్కొక్క వస్తువే అందించి అందులోని వింత ఏమిటో చూపిస్తున్నాడు.

పిల్లల దృష్టి ఒక మూలనున్న ప్యాకెట్టు మీద పడింది.

"అదేమిటి నాన్నా" అని అడిగింది సునీల.

"అదెవరికోసం?" అన్నాడు దీపక్.

"అది మీకు కాదులే" అని దాన్ని దూరంగా పెట్టబోయాడు సురేంద్ర.

"అదేమిటో చూపించండి నాన్నగారూ" అని మారాం చేస్తున్నట్టు అడిగింది సునీల.

"చూపిస్తాను. కాని ముందుగా మీ అమ్మ చూడాలి. తనకోసం స్పెషల్ గిఫ్టు ఇది."

"అమ్మా, త్వరగా రామ్మా" అని కేకలు పెట్టారు పిల్లలిద్దరూ.

"ఏమిటీ గొడవ. అంతదూరం నుంచి వచ్చారు. ఆయన్ని కాస్త ఊపిరి సలుపుకోనివ్వరా?" అంటూ కాఫీ పట్టుకొచ్చింది నీరజ.

అక్కడ పరచిపెట్టి వున్న బొమ్మలన్నీ చూస్తూ, "ఎంతెంత డబ్బు పెట్టి కొన్నారండి! అదీ ఫారిన్ మనీ. అసలే చాలీ చాలనట్లు ఇస్తారు. మీ ఖర్చులు చూసుకోకుండా ఇవన్నీ ఎందుకు తెచ్చారు? అందులో ఈ పిల్లలు రెండు రోజుల్లో వీటిని మూలకో ముక్కగా పారేస్తారు" అంది.

సురేంద్ర నవ్వుతూ "పోనిద్దూ" అన్నట్టు తల ఊపి కాఫీ అందుకున్నాడు.

"అమ్మా నీకు స్పెషల్ గిఫ్టు" అని సన్నగా గొణిగింది సునీల.

సురేంద్ర ఆ ప్యాకెట్ తీసి అందించాడు. నీరజ రంగు కాగితాలన్నీ ఊడదీసింది. పిల్లలిద్దరూ చెరో కాగితం దాచుకొన్నారు. చివరకు బయట పడింది బొమ్మ. "అబ్బ ఎంత బాగుందో" అన్నారు పిల్లలిద్దరూ ఒకేసారి.

"నేను ఒకసారి చూసి ఇస్తానమ్మా" అంది సునీల.

"నేను కూడా" అన్నాడు దీపక్.

"జాగ్రత్త, పడిపోగలదు" అంది నీరజ సునీల చేతుల్లోకి దాన్ని అందిస్తూ.

అది అతి నాజూకయిన జపాను బొమ్మ. చాలా అందంగా ఉంది. కిమోనాలో వుంది. చేతిలో నెమలి పింఛంలా విప్పారిన విసనకర్ర. కళ్ళు ఇటూ, అటూ తిప్పుతుంది. ఒక నృత్య భంగిమ చూపిస్తుంది. మరలా మామూలే.

"దీనికి ఏం పేరు పెడదాం?" అని అడిగింది సునీల.

"జపాను పేర్లేమైనా నీకు తెలుసా?" అని అడిగాడు దీపక్.

"ఇప్పుడు ఇండియాకు వచ్చింది. కాబట్టి ఇండియా పేరే పెట్టాలి" అంది సునీల.

"అలా కుదరదు. ఎక్కడివాళ్ళకు అక్కడి పేర్లే బాగుంటాయి" అన్నాడు దీపక్.

"ఇద్దరూ బాగా ఆలోచించి ఏదో ఒక పేరు పెట్టండి" అని తీర్పు చెప్పాడు సురేంద్ర.

"సుజూకీ" అన్నాడు దీపక్.

"ఛా, అది కారు పేరు" అంది సునీల. వాళ్ళిద్దరూ కాసేపు ఆ బొమ్మను ఇటూ అటూ తిప్పి చూసి వాళ్ళమ్మకు ఇచ్చేశారు. తమ బొమ్మలు పట్టుకొని ఆడుకోటానికి వెళ్ళారు.

నీరజ ఆ బొమ్మనే చూస్తూ కూర్చుంది. "నీకు నచ్చిందా? కొత్త కొత్త బొమ్మలు సెలెక్ట్ చెయ్యడం నీ హాబీ కదా. ఇది నీ కలెక్షన్‌లోకెల్లా గొప్పగా వుండాలని తెచ్చాను. డ్రాయింగ్ రూంలో పెట్టావంటే ఇక వచ్చిన వాళ్లంతా దీని గురించే అడుగుతూ వుంటారు. ఒక్కసారిగా నీ పాపులారిటీ పెరిగిపోతుంది" అంటూ సోఫాలోనే ఆమె ఒడిలో తలపెట్టి పడుకొన్నాడు సురేంద్ర.

నీరజ నవ్వింది. భర్త జుట్టు నిమురుతూ "మీ ట్రిప్పు బాగా జరిగిందా? చూడవలసిన స్థలాలన్నీ చూశారా?" అని అడిగింది. "ఓయస్. ఎక్సలెంట్. వెళ్ళిన పనితో బిజీగా వున్నందున ఎక్కువ స్థలాలు చూడలేదనుకో. కానీ ఈ దేశం వేరు. మనకు తెలిసిన విదేశాలలా లేదు."

"తిండీ, తీర్థం...."

"తిండి పరవాలేదు. కాని తీర్థం సంగతి నీకు తెలుసుకదా నేను పుచ్చుకోనని..."

"అబ్బా ఆ విషయం కాదు. మరీ డబ్బా కొట్టుంటారు మీ నిగ్రహం గురించి."

"కానీ చాప్‌స్టిక్స్‌తో నేనసలు ఒక్క ముక్క కూడా నోట్లో పెట్టుకోలేకపోయాను. అవి పట్టుకోటం వస్తే కదా. అది గొప్ప ఆర్టనుకో. అయితే ఇబ్బందేం లేదు. ఫోర్కు, కత్తి వుండనే వున్నాయి." నీరజ నవ్వింది. "మనకు మొదటి నుండీ అవే గొప్ప నాగరికం" అంటూ పక్కనున్న జపాను బొమ్మ చేతిలోకి తీసుకొని మౌనంగా చూస్తూ వుండిపోయింది.

"ఇందాకా ఈ బొమ్మ నచ్చిందా అంటే నువ్వేమీ మాట్లాడలేదు!"

"నచ్చింది. బాగుంది. ఎ రేర్ పీస్, బట్..."

"బట్ వాట్?"

"ఈ బొమ్మను గాజుకేసులో ఎందుకు బంధించినట్లు? నాకెందుకో అయ్యో! పాపం అనిపిస్తోంది."

"అదేం కొత్త? మట్టి పడకుండా, మురికి కాకుండా బొమ్మల్ని గాజు కేసులో పెట్టడం మామూలే కదా"

"నిజమేననుకోండి. కానీ ఇది మరో బొమ్మా మరో బొమ్మా కాదు. ఒక ఆడ బొమ్మ. అందంగా అలంకరించి, ఆకర్షణీయంగా చేసి బందిఖానా వంటి గాజు కేసులో పెట్టారు. ఇటీజ్ సింబాలిక్. ఇది మంచిదంటారా?"

"ఏమిటి కథ? "ఖైద్ మే హై బుల్ బుల్" లాంటి సినిమాలేమైనా ఎక్కువగా చూస్తున్నావా ఈ మధ్య! అదేదో ప్రాణంతో వున్నట్టు, దాన్ని బందిఖానాలో వుంచినట్లు ఊ తెగ బాధపడిపోతున్నావు." నవ్వుతూ అన్నాడు సురేంద్ర.

"అసలు బొమ్మలు ప్రథమంగా ఏం చెబుతాయి? ఒక ప్రాంతం కల్చరు, బట్టలు, మనిషి జీవించే తీరు తెన్నులూ తెలియజేస్తాయి. ఏదో ఒక ప్రదేశానికి వెళ్ళిన గుర్తుగా ఇవి కొంటాం అంతే. అంతకుమించి మరేం లేదు."

"అవుననుకోండి. అంతేకాక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనం ఆలోచించే తీరు తెన్నులు కూడా తెలియజేస్తాయి కదా!" అని నీరజ ఆ బొమ్మను తీసుకెళ్ళి బుక్ కేసు మీద పెట్టింది. "ఎక్కువగా ఫెమినిస్టు ఐడియాలుంటే ఇలాగే ఆలోచిస్తారు. వాటికీ హద్దుండాలి. బొమ్మలకు, రాళ్ళకు, రప్పలకు కూడా మన సిద్ధాంతాలు అన్వయించామంటే ఇక బ్రతడం కష్టమవుతుంది" అని సురేంద్ర లేచి గదిలోకి వెళ్ళాడు.

ఇంటికి వచ్చిన వాళ్ళంతా ఆ బొమ్మను తెగమెచ్చుకొంటున్నారు.

"ఎక్కడిది. ఎంత ఖరీదు! ఎప్పుడు తెచ్చారు?" అని అడుగుతూనే వున్నారు. అప్పుడు ఇంట్లో ఎవరుంటే వాళ్ళు అన్నిటికీ సమాధానాలు చెబుతున్నారు. కొందరు ఫ్రెండ్సయితే కేవలం బొమ్మను చూడడానికే వచ్చారు కూడా. కాని ఆ బొమ్మ కంటపడినప్పుడల్లా నీరజ మనస్సు కలుక్కుమంటోంది. నీరజ ఒక స్త్రీల పత్రిక నడుపుతోంది. ఆ పత్రిక విశిష్టమైంది. మామూలుగా కుట్లు, అల్లికలు, వంటలు, పిండి వంటలు, ప్రేమ కథలు అంటూ స్త్రీ లోకం చుట్టూ గిరి గీయకుండా స్త్రీని వ్యక్తిగా, ఇంటలెక్చుయెల్‌గా తీర్చిదిద్దడానికి, సామాజికంగా జాగృతి కలిగించడానికి ప్రయత్నించే పత్రిక అది. నేటి సమాజంలో అతి సహజంగా శృంఖలాలతో బ్రతికేస్తూ, ప్రతి చిన్న విషయానికీ కృతజ్ఞతలు తెలుపుకొంటూ, అణిగీ మణిగీ జీవితాలను సాగిస్తూ, తమని తాము కించపరచుకొంటున్న స్త్రీలకు తమ శక్తి ఏమిటో, తమ హక్కులేమిటో తెలుసుకొమ్మని, తమకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించమని, ఆత్మ స్థైర్యాన్నీ, అంతఃశక్తినీ చేకూర్చుకోమనీ ఉద్బోధించే పత్రిక అది.

మొదటి నుంచి సమస్యలను స్త్రీ పరంగా ఆలోచించి, వాళ్ళకు జరుగుతున్న అన్యాయాలకు చలించి, తను చేస్తున్న లెక్చరర్ ఉద్యోగం వదిలి పత్రిక పెట్టింది నీరజ.

తనకు అప్పటికి ఫెమినిస్టు ఐడియాలూ తెలీదు. ఉమెన్స్ లిబ్ ఉద్యమం గురించీ తెలీదు. అవి తెలిసిన తర్వాత వాటిలో కొన్ని అంశాలు తనకు షాలోగా, నాటకీయంగా కనిపించాయి.

అనవసరమైన మిలిటెన్సీ చూపడం, అయినదానికీ కాని దానికీ గొంతెత్తి అరవడమే స్త్రీ స్వాతంత్ర్య లక్ష్యం కాదని కూడా నీరజ గుర్తించింది. ఎన్నో సభలలో, కాన్ఫరెన్స్‌లలో తన భావాలు బయటపెట్టి మన్ననలందుకొంది. తనకు స్త్రీల ప్రతినిధిగా ఎంతో పేరుంది. అటువంటి నీరజ ఈనాడు ఒక బొమ్మ గురించి చాలా ఆందోళన చెందుతోంది. ఆ బొమ్మను చూసినప్పుడల్లా గిల్టీగా ఫీలవుతోంది. అది తన సైకాలజీ మీద పనిచేస్తోంది. స్త్రీ విముక్తి గురించి మాట్లాడే తను గాజుకేసులో బంధించిన ఒక స్త్రీ బొమ్మను గొప్పగా డ్రాయింగ్ రూంలో పెట్టుకొంది. సూచనప్రాయంగా తనెటువంటి భావనకు దోహదం చేస్తోంది? ఆ బొమ్మ నిస్సహాయంగా కనిపిస్తోంది. దీనంగా అర్థిస్తున్నట్లుంది.

ఇక భరించలేక ఆ బొమ్మను డ్రాయింగ్ రూం నుంచి తీసి లోపల ఎక్కడో అలమారాలో దాచేసింది. సాయంత్రం ఆఫీసు నుండి రాగానే ఆ బొమ్మ మామూలుగా డ్రాయింగ్ రూంలో సైడు టేబిల్ మీద ప్రత్యక్షమైంది.

"ఈ బొమ్మ ఇక్కడికెలా వచ్చింది?" అని అడిగింది కూతుర్ని.

"నాన్నగారు తెచ్చిపెట్టారు" అంది సునీల.

నీరజ తిరిగి దాన్ని తీసుకొని లోపలికి వెళ్లింది. అలమారలో దాచెయ్యాలని. గదిలో ఏదో పత్రిక చదువుతున్న సురేంద్ర కనిపించాడు. "మళ్ళీ దీన్ని లోపలికి తెస్తున్నావేమిటి? అదేదో అసభ్య దృశ్యంలా, అదక్కడ వుండడమే సిగ్గు చేటులా అనుకొంటున్నట్టుంది నీ వ్యవహారం చూస్తుంటే! లోపల దాచెయ్యటానికేనా అంత డబ్బు పెట్టి కొన్నది? నీ కోసం ప్రత్యేకంగా వెతికి వెతికి తెచ్చానే, ఆ అభిమానమైనా లేదా?"

ఆయనకు తన మనసులోని మాట ఎలా చెప్పాలో అర్థం కాలేదు నీరజకు. కథలు, పిల్లల పాఠ్యపుస్తకాలు కూడా ఆడ పిల్లను తక్కువ చేయకుండా వుండే తీరులో అతిశ్రద్ధగా వ్రాస్తున్న ఈ రోజుల్లో బొమ్మల విషయంలో కూడా శ్రద్ధ వహించాలి కదా. పిల్లలకు ఆడుకోటానికి తుపాకులు, కత్తులు ఇస్తే వాళ్ళ మనస్థితి ఎలా ఉంటుంది? ఇంతలో "సునీలా" అని కూతుర్ని పిలిచాడు సురేంద్ర.

"ఏమండీ నాన్నాగారూ" అంటూ వచ్చింది సునీల.

"ఈ బొమ్మ తీసుకెళ్ళి డ్రాయింగ్ రూంలో పెట్టమ్మా."

సునీల తల్లి చేతిలో నుండి బొమ్మ తీసుకొంది డ్రాయింగ్ రూంలో పెట్టడానికి. నీరజ ఏదో చెబుదామని భర్తవైపు తిరిగింది. ఇంతలో బయట భళ్ళుమని చప్పుడు వినిపించింది. తను పరుగుతో డ్రాయింగ్ రూం చేరుకొంది. ఆమె వెంట సురేంద్ర కూడా వచ్చాడు.

సునీల బిక్క మొహం వేసుకొని చూస్తోంది. నేల మీద గాజు ముక్కల మధ్య ఆ జపాను బొమ్మ పడి వుంది. "విరగ్గొట్టావూ? అది తెచ్చినప్పటి నుంచి అనుకొంటూనే వున్నాను. ఇలాంటిదేదో అవుతుందని. వున్నచోట వుండనిస్తే కదా. కనీసం వారం రోజులైనా జాగ్రత్తగా పెట్టుకోలేక పొయ్యాం. ఈ ఇంటికి ఏదైనా తీసుకురావడం దండగే" అన్నాడు సురేంద్ర. అతనికి బాగా కోపంగా ఉంది. బాధగానూ వుంది.

గాజు ముక్కల మధ్య నుండి బొమ్మను పైకి తీసింది నీరజ. "అది పగిలిపోయే వరకు తల్లీ కూతుళ్ళకు నిద్రపట్టలేదు. ఇక ఆనందించండి" అన్నాడు విసుగ్గా.

సునీల భయంగా ఇటు తండ్రివైపూ, అటు తల్లివైపూ చూసింది. ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు పొంగబోతున్నాయి. నీరజ సునీలను దగ్గరగా తీసుకొంది. "ఫర్వాలేదు లేమ్మా, నువు కావాలని పగలగొట్టలేదుగా. చెయ్యి జారింది అంతే. ఇటు చూడు బొమ్మ అసలు విరగలేదు. నిజానికి ఇప్పుడే బాగుంది. ఏడవకు" అని రాలుతున్న కన్నీళ్ళు తుడిచింది.

సురేంద్ర కోపం కూడా తగ్గింది. "అయిపోయిందేదో అయిపోయింది. ఇంకా ఏడుపెందుకు? దీపక్ ఎక్కడున్నాడో చూడు. కొత్త కార్టూన్ ఫిల్ము వీడియో కాసెట్ తెచ్చాను చూద్దురు గాని" అన్నాడు కూతుర్ని దగ్గరకు తీసుకొని తల నిమురుతూ.

"నేను ఐస్‌క్రీం తెచ్చాను" అంది నీరజ టేబిల్ పైన పెట్టిన ప్యాకెట్ విప్పుతూ. సునీల చెంగున దూకుతూ బయటికి వెళ్ళింది తమ్ముణ్ణి పిలవటానికి.

నీరజ మరోసారి బొమ్మవైపు చూసింది. ఎంతో రిలీఫ్ ఫీలయింది. తన సమస్యకు కూతురు తెలిసో తెలియకో చక్కటి పరిష్కారం చూపించింది. ఇప్పుడు జపనీస్ బొమ్మ బంధ విముక్తిరాలిలా, స్వేచ్ఛా జీవిలా, లిబరేటెడ్ వుమన్‌లా మరింత అందంగా కనిపించింది తన కళ్ళకు.

*(24 జూలై 1992)*